సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 3 । మే । 2023



మహాప్రసాదం..
అందిన వారిదే భాగ్యం
బ్రహ్మంగారిమఠంలో ఆరు రోజుల పాటు జరిగిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు ముగిశాయి. - 8లో



సరిహద్దు చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా
కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టులలో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.74	రూ.96
రెండోరకం	రూ.50	రూ.72



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 488 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	430	537
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 1,243.36 కిలోలు

న్యూస్‌రీల్

వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ క్రీడాపాఠశాలలో మూడు క్రీడాంశాల్లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్. బాషామొహిద్దీన్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు మేనెల 1 నుంచి 31వ తేదీ వరకు స్విమ్మింగ్, ఆర్చరీ, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిపుణులైన శిక్షకుల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైవీయూలో ఎన్‌ఎస్‌ఎస్ నూతన పీఓల నియామకం



ఎన్‌ఎస్‌ఎస్ పీఓలకు నియామక పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య కృష్ణారెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కళాశాల జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్ల నియామకం జరిగింది. నూతనంగా డా. ఎస్.వి. వెంకటరమణ (సహ ఆచార్యులు, జువాలజీ), డా. ఎం. శ్రీధర్‌రెడ్డి (సహ ఆచార్యులు, పర్యావరణ శాఖ), డా.ఎస్.సునీత (సహ ఆచార్యులు, అనువర్తిత గణితశాస్త్రశాఖ), డా. కె. శ్రీనివాసరావు (సహ ఆచార్యులు, కంప్యూటర్‌సైన్స్)లకు నియామక పత్రాలను మంగళవారం ప్రిన్సిపాల్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అందజేశారు. వైవీయూ ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో వీరికి నూతన పీఓలుగా నియామక పత్రాలు అందజేశారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు న్యాక్ గుర్తింపు



బి డబుల్ ప్లస్ గ్రేడ్ సాధించిన ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

వాల్మీకిపురం: వాల్మీకిపురం ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు జాతీయ మదింపు, గుర్తింపు సంస్థ (న్యాక్) బి డబుల్ ప్లస్ గ్రేడ్ లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాబు, వైస్ ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి తెలిపారు. తమిళనాడు రాష్ట్రం సేలంలోని పెరియార్ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ముత్తుచెలియన్ నేతృత్వంలోని పీర్ టీం కళాశాలను ఏప్రిల్ 26, 27 తేదిల్లో పర్యటించారు. పీర్ టీంలో మిజోరాం రాష్ట్ర రాజధాని ఐజ్వాల్లో ఉన్న మిజోరాం విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్రశాఖకు చెందిన ఇలంగ్బం నిక్సన్ సింగ్, కర్ణాటక రాష్ట్రం కొడుగు జిల్లా మడికేరిలో ఉన్న ఫీల్డ్ మార్షల్ కెఎం కరియప్ప కళాశాల పూర్వ ప్రిన్సిపల్ డాక్టర్ పార్వతి అప్పయ్య కళాశాలను ప్రతి శాఖను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. కళాశాలలోని ఎన్‌ఎస్‌ఎస్, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, గ్రీవెన్స్ సెల్, ప్లేస్మెంట్ సెల్, రెడ్ రిబ్బన్ క్లబ్, తదితర వారిని పరిశీలించి, న్యాక్‌కి రిపోర్టు అందించారన్నారు. బెంగుళూరు కార్యాలయం నుంచి స్థానిక కళాశాలకు 2.83 సీజీపీఏతో బి డబుల్ ప్లస్ గ్రేడ్ వచ్చినట్లు తెలిపారు.

సమన్వయంతో విధులు నిర్వహించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి

కడప అర్బన్: న్యాయం కోసం అందరం సమన్వయంతో విధులను నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. మంగళవారం కడప న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) అధ్యక్షుడు జి.వి. రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నూతన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తితో కడప న్యాయవాదుల సంఘం భవనంలో న్యాయవాదులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. జిల్లా కోర్టు ఆవరణలో క్రిమినల్ కోర్టుల భవన సముదాయ నిర్మాణ పనుల ప్రతిపాదనలు పెండింగ్‌లో వున్నట్లు తన దృష్టికి కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీసుకువచ్చారన్నారు. ఈ పనులు త్వరగా ప్రారంభించేందుకు కృషి చేస్తానన్నారు. ఈనెల 13న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌లో అధికసంఖ్యలో కేసులను పరిష్కరించే విధంగా న్యాయవాదులంతా సహకరించాలని ఆయన కోరారు.

మదనపల్లెకు మహర్దశ



బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

- బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను యూనివర్సిటీగా మార్చేందుకు సీఎం గ్రీన్ సిగ్నల్
- పట్టణ ప్రజల చిరకాల కోరిక సాకారం దిశగా అడుగులు
- ఎన్నికల హామీ నిలుపుకున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా
- ఎడ్యుకేషనల్ హబ్‌గా మారనున్న మదనపల్లె



మదనపల్లెలో యూనివర్సిటీ ఏర్పాటుపై సీఎం వైఎస్ జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

మదనపల్లె: మదనపల్లె చరిత్రలో నూతన అధ్యాయం ఆవిష్కృతమవుతోంది. ప్రజల చిరకాల కోరిక సాకారం దిశగా అడుగులు పడ్డాయి. పట్టణంలో చారిత్రక నేపథ్యం కలిగిన బిసెంట్ థియోసాఫికల్ ఎయిడెడ్ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్న ఎనిమిది నెలలకే డాక్టర్ అనిబిసెంట్ యూనివర్సిటీగా మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మంగళవారం విజయవాడలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ లోక్‌సభపక్షనేత, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎమ్మెల్సీ భరత్‌లు కలిశారు. బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను డాక్టర్ అనిబిసెంట్ యూనివర్సిటీగా మార్పు చేయాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆమోదం తెలుపుతూ హయ్యర్ ఎడ్యుకేషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీ హేమచంద్రారెడ్డిని అవసరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బీటీ కళాశాలను ప్రభుత్వపరం చేయడంతో పాటుగా యూనివర్సిటీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. అందులో భాగంగా గత ఏడాది ఆగస్టులో బీటీ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. బీటీ కళాశాలను డాక్టర్ అనిబిసెంట్ యూనివర్సిటీగా మార్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగీకరిస్తూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు. యూనివర్సిటీ ప్రతిపాదనలపై క్యాబినెట్ సమావేశంలో చర్చించి అసెంబ్లీలో బిల్లును ఆమోదిస్తామన్నారు. నాలుగునెలల కాలంలో దీనికి సంబంధించిన అన్ని పాలనాపరమైన ప్రక్రియలు పూర్తయి మదనపల్లె ప్రజల చిరకాల కోరిక సాకారమవుతుందన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ..మదనపల్లె అభివృద్ధిలో, పట్టణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారం మరువలేనిదన్నారు. బీటీ కళాశాలను ప్రభుత్వ పరం చేయడం, యూనివర్సిటీగా మార్పుచేయడంలో ఎంపీ మిథున్‌రెడ్డి కృషి ఎనలేనిదన్నారు. గత ప్రభుత్వాల్లో పాలకులు బీటీ కళాశాల విషయంలో కేవలం హామీలు గుప్పించి ప్రజలను మోసం చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి నెరవేర్చేందుకు కృషి చేశారని, వారికి పట్టణ ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీటీ కళాశాలను యూనివర్సిటీగా మార్పు చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఎడ్యుకేషనల్ హబ్‌గా మదనపల్లె..

మదనపల్లెలో డాక్టర్ అనిబిసెంట్ యూనివర్సిటీ ఏర్పాటుతో రాజంపేట పార్లమెంటరీ పరిధిలోని మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, పుంగనూరు, రాయచోటి, సత్యసాయిజిల్లాలోని కదిరి నియోజకవర్గాల వారు ఉన్నతవిద్య చదివేందుకు అనుకూలంగా ఉంటుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మెడికల్ కళాశాల, డాక్టర్ అనిబిసెంట్ యూనివర్సిటీ ఏర్పాటుతో మదనపల్లె ఎడ్యుకేషనల్ హబ్‌గా మారనుంది. విద్య, వైద్య, వ్యాపార రంగాలకు కీలకం కానుంది. యువతకు ఉన్నత విద్యతో పాటు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి.

కాటేస్తున్న కుక్కలు!



- జిల్లాలో వీధి కుక్కల స్వైర్యవిహారం
- పెరుగుతున్న కుక్కల దాడులు
- తాజాగా రాజంపేటలో బాలుడిని కరిచిన కుక్క
- కుక్కలను కట్టడి చేయాలంటున్న ప్రజలు



కుక్క కాటుకు గాయపడిన బాలుడు

రాజంపేట: జిల్లాలో వీధి కుక్కల దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. జిల్లాలో రాజంపేట, రాయచోటి, మదనపల్లె, బి.కొత్తకోట మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2వేలకుపైగా వీధి కుక్కలు ఉంటాయని మున్సిపాలిటీ అధికారులు అంచనా వేస్తున్నారు. పట్టణాల్లో వీధి కుక్కల బెడద కొనసాగుతోంది. వీటికి అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు పడుతున్నా వీధి కుక్కల సంతతి పెరుగుతూనే ఉంది. ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్) తన నివేదికలో కుక్కకాటుకు అనేక మంది బలవుతున్నారని తెలిపింది. రేబిస్ వైరస్ బారినపడే ప్రమాదాలు మళ్లీ అధికమవుతున్నాయనే ఆందోళన వ్యక్తంచేస్తోంది.

భయాందోళనలో ప్రజలు..
వీధి కుక్కల దాడులు పెరిగిపోతుండటంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే కుక్కలను అదుపు చేసేందుకు ఆయా మున్సిపాలిటీల అధికారులు పట్టుకొని కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేసి, అటవీ ప్రాంతాల్లో వదలివేస్తున్నారు. ఇటీవల రాజంపేట పట్టణంలో ఇద్దరు పిల్లలు, ఒక వృద్ధురాలికి కుక్క కరవడంతో ఈ సంఘటనను మున్సిపాలిటీ సీరియస్‌గా తీసుకొని 153 కుక్కలను పట్టుకొని శస్త్రచికిత్స చేసి వదిలేశారు.

తాజాగా మరో సంఘటన..
తాజాగా మంగళవారం రాజంపేట పట్టణం మన్నూరులోని శారదాస్కూల్ వెనుక వైపు వీధిలో షేక్‌రియా అనే బాలుడిపై వీధి కుక్క దాడిచేసింది. మున్సిపల్ కమిషనర్ ఆదేశంతో స్థానిక ఏరియా ఆసుపత్రిలో చికిత్స చేయించారు.

మాంసపు వ్యర్థాలు తిని..
జిల్లాలో అన్ని పట్టణాల్లో రోడ్లపై మాంసం దుకాణాలు ఉండటం సర్వసాధారణం. అయితే మాంసం దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను రోడ్డుపై పడేయటం వల్ల వాటిని వీధి కుక్కలు తింటున్నాయి. మాంసం రుచి మరిగి చివరకు మనుషులపై దాడి చేస్తున్నాయి.

అందుబాటులో రేబిస్ వ్యాక్సిన్లు



జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో రేబిస్ వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. కుక్క కాటుకు గురైన వారు స్థానిక పీహెచ్‌సీకి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకోవచ్చు.
-ఎన్.కొండయ్య, డీఎంఅండ్‌హెచ్‌ఓ

కు.ని ఆపరేషన్ చేస్తున్నాం



ప్రభుత్వ నిబంధనల మేరకు వీధి కుక్కలను పట్టుకొని కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించాము. జియో ట్యాగ్ చేసి పట్టుకున్నచోటే వదిలేస్తున్నాము.
-జనార్దన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్

విద్య.. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత

ఆరోగ్య కేంద్రం, అంగన్వాడీ కేంద్రాల పరిశీలనలో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



సుండుపల్లెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి(సుండుపల్లె): రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా టి.సుండుపల్లె మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు ఆరోగ్యంతో పాటు మంచి విద్యను అందించాలన్న సదుద్దేశంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అంగన్వాడీ కేంద్రాలు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. తొలుత మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మెయిన్‌స్టోర్‌ను తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రం పనితీరు ప్రజలకు అందుబాటులో ఉన్న మందుల నిలువలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. సమీపంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించారు. కేంద్రం పరిధిలో ఎంత మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు. రక్తహీనత కలిగిన వారు ఎంత మంది తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండయ్య, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మీ, మండల రెవెన్యూ అధికారి మహబూబ్‌చాంద్, ఎంపీడీఓ రామచంద్ర, ఎంఈఓ వెంకటేష్‌నాయక్, వైద్య ఆరోగ్య శాఖ, ఐసీడీఎస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఇరిగేషన్ అమలులో దేశంలో పదో స్థానం

సంబేపల్లె: మైక్రో ఇరిగేషన్ అమలులో 2022-23 ఆర్థిక సంవత్సరంలో అన్నమయ్య జిల్లా దేశంలో పదో స్థానం, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిందని గుంటూరు ఏపీఎంఐపీ ప్రాజెక్టు ఆఫీసర్ సీబీ హరినాథ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని 2022-23 ఆర్థిక సంవత్సరంలో మంజూరైన మైక్రో ఇరిగేషన్ పరికరాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా మైక్రో ఇరిగేషన్ అమలు చేస్తున్నామన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో మైక్రో ఇరిగేషన్ విడి పరికరాలు అందుబాటులో ఉండేటాయన్నారు. ఈ ఫర్టిగేషన్ చేయడం ద్వారా ఎరువుల వాడకం తగ్గి వినియోగం 90శాతం పెరుగుతుందని తెలిపారు. ఈ విధానంలో ఎరువులు నేరుగా మొక్క వేరు వద్ద అందించడం వలన మొక్కలు బాగా ఏపుగా పెరిగి అన్ని మొక్కలు సమాంతరంగా పెరిగి నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు 12,000 హెక్టార్లు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఆర్‌బీకే పరిధిలోని నీటి వసతి గల రైతులందరూ మైక్రో ఇరిగేషన్ కోసం దరఖాస్తు చేసుకునేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సూక్ష్మనీటి సాగు అధికారి వెంకటేశ్వరరెడ్డి, ఉద్యాన అధికారి వనితాబాయ్, ఆసియా, ఎంఐఈ గురుప్రసాద్, ఎంబీడీసీ చంద్రశేఖర్‌రెడ్డి, వినోద్, రమేష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై ఒబెరాయ్ హోటల్

- 20 ఎకరాలు కేటాయిస్తూ జీఓ జారీ
- 2,500 యువ టూరిజం క్లబ్బుల ఏర్పాటుకు చర్యలు
- పర్యాటకశాఖ ఆర్‌డీ రమణప్రసాద్



హార్సిలీహిల్స్‌పై పరిశీలిస్తున్న ఆర్‌డీ డాక్టర్ రమణప్రసాద్, డీటీఓ

బి.కొత్తకోట: బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ వేసవి విడిది కేంద్రం హార్సిలీహిల్స్‌పై ప్రముఖ హోటల్ సంస్థ ఒబెరాయ్‌కు 20 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పర్యాటకశాఖ రీజినల్ డైరెక్టర్ (తిరుపతి) డాక్టర్ రమణప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన అన్నమయ్య జిల్లా పర్యాటక అధికారి ఎం.నాగభూషణంతో కలిసి హార్సిలీహిల్స్‌పై పర్యటించారు. పర్యాటకశాఖ పరిధిలోని భూముల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ అధికారుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం రమణప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ ఒబెరాయ్ సంస్థ హార్సిలీహిల్స్‌పై అంతర్జాతీయ స్థాయిలో పర్యాటకులకు వసతి, సౌకర్యాలను కల్పించేలా విల్లాలను నిర్మిస్తుందని చెప్పారు. భూమిని అధికారికంగా అప్పగించి ఒప్పందం కుదుర్చుకోవాల్సి ఉందన్నారు. ఒబెరాయ్ రాకతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. వెల్లిగల్లు, మల్లయ్యకొండపై టూరిజం కార్యకలాపాలను ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. మల్లయ్యకొండపై రిసార్ట్, వ్యూపాయింట్, అడ్వంచర్స్ స్పోర్ట్స్ నిర్మాణం కోసం కన్సల్టేటింగ్ సంస్థ అధ్యయనం చేస్తోందని చెప్పారు. విద్యార్థులతో 2,500 యువ టూరిజం క్లబ్బులు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. ఈ క్లబ్బుల ఏర్పాటు ద్వారా సంస్కృ, సంప్రదాయాల గురించి తెలియజేస్తూ పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలపై అవగాహన కల్పిస్తామన్నారు. పర్యాటక రంగంలో ప్రైవేటు-ప్రభుత్వ భాగస్వామ్యంతో నడుస్తున్న యూనిట్ల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వివరించారు. పర్యాటక ప్రాంతాలకు పెరిగిన సందర్శకులకు అనుగుణంగా చేపట్టాల్సిన సౌకర్యాలు, వసతులపై ఎలాంటి చర్యలు చేపట్టాలన్న అంశాలను పరిశీలిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, సర్వేయర్ శ్రీవాణి, వీఆర్‌ఓ అమరనాథ్, టూరిజం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి నిల్వకు గోదాము వినియోగం

రాయచోటి: రాయచోటి మార్కెట్ యార్డులో ఉన్న గోదామును ఎన్నికల సామగ్రిని భద్రపరిచేందుకు వినియోగిస్తామని ఆర్డీఓ రంగస్వామి తెలిపారు. మంగళవారం మార్కెట్ యార్డు ఆవరణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సామగ్రిని భద్రపరుచుకునేందుకు గోదామును కేటాయించాలని, మార్కెట్ యార్డు సెక్రటరీకి లేఖ రాశామన్నారు. గతంలో ఈ గోదామును రెవెన్యూ అధికారులు స్టాక్ పాయింట్‌గా ఉపయోగించేవారని, గత ఏడాది నుంచి ప్రైవేటు వ్యక్తులకు అద్దెకిచ్చారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ అవసరాలకు గోదామును ఉపయోగించుకోవాలనే ఉద్దేశంతో అద్దెకు తీసుకున్నవారిని ఖాళీ చేయాలని మార్కెట్ యార్డు అధికారులు కోరారన్నారు. కాగా కొంతమంది పనిగట్టుకొని ప్రభుత్వ గోదామును ఖాళీ చేయించడంపై రాజకీయం చేయడం తగదన్నారు.

నేటి నుంచి దేవుని కడపలో తెప్పోత్సవాలు

- జల విహారం చేయనున్న కడప రాయుడు
- పూర్తయిన ఏర్పాట్లు



తెప్పోత్సవానికి సిద్ధంగా ఉన్న కోనేరు

కడప కల్చరల్ : కడప రాయుడు శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక తెప్పోత్సవాలు బుధవారం నుంచి మూడు రోజులపాటు జరగనున్నాయి. జిల్లాలో అత్యంత పురాతనమైన ఆలయాలలో కడప రాయుని ఆలయం ఒకటి. చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా ఈ క్షేత్రానికి ఎంతో పేరుంది.

- జనవరి చివరిన బ్రహ్మోత్సవాలు, మే మాసంలో తెప్పోత్సవాలు జరుగుతాయి. బుధ, గురు, శుక్ర వారాలలో జరగనున్న తెప్పోత్సవం కోసం ఇప్పటికే తిరుపతి నుంచి ప్రత్యేకంగా తెప్పను తెప్పించి ఉంచారు. పుష్కరిణిలోని నీటిని మూడు రోజుల క్రితం పూర్తిగా తొలగించారు. ప్లాట్‌ఫామ్‌కు సమంగా ఉండేలా బోర్ల నుంచి నీటిని నింపుతున్నారు. ఆలయంలో కూడా పూర్తిగా రంగురంగుల చలువ పందిళ్లు వేసి భక్తులకు వేసవి బాధలు లేకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకున్నారు.

కోనేటి చరిత్ర..
కడప రాయుని కోనేటి (పుష్కరిణి)కి చరిత్ర ఉంది. జిల్లాలోని పలు దేవాలయాల వద్ద కోనేర్లను మనం గమనించవచ్చు. అందులో ఈ పుష్కరిణికి విశిష్ఠమైన చరిత్ర ఉంది. చూడటానికి, వ్యవహారంలోనూ ఈ పుష్కరిణి కేవలం శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయానికి చెందినదేనని భావిస్తారు. కానీ ఆలయం ఎదురుగా అత్యంత సమీపంలో ఉన్న శ్రీ సోమేశ్వరస్వామి గుడికి ఈ పుష్కరిణి అనుకుని ఉండడం విశేషం. దీంతో ఈ పుష్కరిణి దేవునికడప శివాలయానికి కూడా చెందినదని పెద్దలు పేర్కొంటున్నారు. జిల్లాలో పెద్దదైన కడప రాయుని పుష్కరిణిని విజయనగర సామ్రాజ్య పాలకులు, సంఘమ వంశీయులు, ప్రౌఢ దేవరాయులు 1442లో దుందుభి నామ సంవత్సరం భాద్రపద శుద్ధ ఏకాదశి నాడు పుష్కరిణి తవ్వకం పనులను ప్రారంభించినట్లు శాసనాధారాలు ఉన్నాయి. పలువురు వాస్తు పండితులు నిర్మాణ రంగంలో నిపుణులైన వారితో చర్చించి ఈ కోనేరును నిర్మించారని తెలుస్తోంది. ఈ వివరాలన్నీ ఆలయ రంగమండపంలో మొన్నటివరకు శిలా శాసనంలో ఉండేవని కడప కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది.

- 1810-15 ప్రాంతంలో కల్నల్ మెకంజీ వద్ద రెవెన్యూశాఖలో పనిచేసిన ఉద్యోగి నారాయణరావు జిల్లాలోని శాసనాలు, వాటి వివరాలను గ్రంథంగా ప్రచురించారని కైఫీయత్తులలో పొందుపరిచారు. దేవునికడప ఆలయ రంగమండపంలో పుష్కరిణి నిర్మాణ వివరాలను తెలిపే శిలా శాసనం ఉండేదని, నారాయణరావు పరిశీలించినప్పటికే అది పగుళ్ల బారి ఉండిందని తెలుస్తోంది. ఈ వివరాల ప్రకారం దేవునికడప ఆలయ పుష్కరిణి అత్యంత పురాతనమైనదిగా చెప్పవచ్చు. ఇటీవల లక్షల రూపాయలు వెచ్చించి పుష్కరిణికి మరమ్మతులు చేశారు. చుట్టూ మురికి నీరు వెళ్లేలా కాలువలు నిర్మించి ప్రధాన ప్లాట్‌ఫాంతోపాటు కోనేరు చుట్టూ కూడా ఆధునికత కనిపించేలా రూపుదిద్దారు.

ఉత్సవాల వివరాలు..
కడప రాయుని తెప్పోత్సవాల వివరాలిలా ఉన్నాయి. బుధవారం శ్రీవారు శ్రీకృష్ణునిగా గోదాదేవితో కలిసి పుష్కరిణిలో మూడు ప్రదక్షిణలు నిర్వహించనున్నారు. గురువారం కడప రాయుడు శ్రీదేవి భూదేవి సమేతంగా ఐదుమార్లు, శుక్రవారం కూడా ఉభయ దేవేరులతో కలిసి శ్రీ లక్ష్మి వెంకటేశ్వరుడు కోనేటిలో ఏడు మార్లు జల విహారం చేయనున్నారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రతిరోజు సాయంత్రం 4.00 గంటల నుంచి 5.00 గంటల వరకు స్నపన తిరుమంజనం, 6.00 నుంచి 6.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులు తెప్పలో స్వామి, అమ్మవార్లకు వేదపఠనం, భక్తి గీతాలాపనలు, మంగళ వాయిద్య నీరాజనం నిర్వహించనున్నారు.

పశుగణాభివృద్ధికి కృషి చేయాలి

కడప అగ్రికల్చర్: జిల్లాలో పశుగణాభివృద్ధికి పశువైద్యులు కృషి చేయాలని రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ మాధవరెడ్డిలు పేర్కొన్నారు. కడపలోని పశుసంవర్థకశాఖ డివిజన్ కార్యాలయంలో వివిధ అనుబంధశాఖల అధికారులతో మంగళవారం సంబటూరు ప్రసాద్‌రెడ్డి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులలో వచ్చే వ్యాధుల గురించి, వాటికి ముందు జాగ్రత్తగా వేసే టీకాల లభ్యత గురించి చర్చించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఆర్. మాధవరెడ్డి మాట్లాడుతూ పెయ్య దూడల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్, కడప డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఐఎస్‌డీపీ సహాయ సంచాలకులు రమణారెడ్డి, పశు వైద్యుల సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ శివరామిరెడ్డి, ఖాజీపేట సహాయ సంచాలకులు నాగమణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆస్తి కోసం మహిళపై హత్యాయత్నం


చికిత్స పొందుతున్న గోపెమ్మ

కురబలకోట : ఆస్తి కోసం భర్త లేని మహిళపై దాయాదులు హత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన కురబలకోట మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తెట్టుకు చెందిన గోపెమ్మ (56) భర్త కొన్నేళ్ల క్రితం చనిపోయాడు. మూగ బిడ్డను పోషించుకుంటూ జీవనం సాగిస్తోంది. భర్త నుంచి ఈమెకు పది ఎకరాల వ్యవసాయ భూమి సంక్రమించింది. దీనిపై కన్నేసిన దాయాదులు ఆమెను హతమార్చాలని పన్నాగం పన్నారు. సోమవారం రాత్రి ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని గుర్తించి ఆమె నోట్లో గడ్డలు కుక్కి కర్రలతో దాడి చేసి చంపడానికి యత్నించారు. బాధితురాలి కేకలు విన్న ఇరుగుపొరుగు వారు వెంటనే అక్కడికి చేరుకోవడంతో పరారయ్యారు. బాధితురాలు మదనపల్లె జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు మంగళవారం తెలిపారు.

పెళ్లయిన ఆరు నెలలకే ఆత్మహత్య


గౌసియా (ఫైల్)

కురబలకోట : పెళ్లయిన ఆరు నెలలకే యువతి ఆత్మహత్య చేసుకున్న విషాద సంఘటన కురబలకోట మండలంలో చోటు చేసుకుంది. ముదివేడు పోలీసుల కథనం మేరకు.. మండలంలోని తెట్టు కస్పాకు చెందిన ఎస్.జాఫర్‌వల్లి (24) ఆరు నెలల క్రితం మదనపల్లె లచ్చన్న వీధికి చెందిన గౌసియా (22)ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆమె ఐదు నెలల గర్భవతి. వరకట్నం కోసం అత్తింటి వేధింపులతో గత నెల 28న తెట్టులోని అత్తారింటిలో ఆమె పురుగుల నివారణ మందు తాగింది. వెంటనే మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అనంతరం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె సోమవారం రాత్రి మృతి చెందారు. తహసీల్దారు ఎం.బీమేశ్వరరావు శవ పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. అత్తింటి వారి వరకట్న వేధింపుల వల్లే తమ కుమార్తె బలవన్మరణం చెందిందని ఆమె తండ్రి షేక్ రెడ్డి ఇనయతుల్లా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. వరకట్నం చట్టం కింద బాధ్యులైన మృతురాలి భర్త, మామపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు రూరల్ సర్కిల్ సీఐ శివాంజనేయులు తెలిపారు.

మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం

- ముగిసిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తజనం
- మార్మోగిన 'బ్రహ్మ'నామస్మరణ


బ్రహ్మంగారిమఠం మాఢ వీధుల్లో శ్రీగోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఊరేగింపు


పూజ చేస్తున్న పూర్వపు మఠాధిపతి కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి


భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది

బ్రహ్మంగారిమఠం : 'మహాప్రసాదం.. అందిన వారిదే భాగ్యం' అంటూ భక్తులు పోటీపడ్డారు. స్వామి ప్రసాదం స్వీకరించడం కోసం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బ్రహ్మంగారిమఠంలో ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరి రోజు మధ్యాహ్నం మహాప్రసాదం వినియోగం చేపట్టారు. బియ్యం, బెల్లం, నెయ్యి, జీడిపప్పు, ద్రాక్ష, యాలక్కలు ఎండుకొబ్బరి, పాలు తదితరాలతో మహాప్రసాదాన్ని తయారు చేశారు. గర్భాలయంలో స్వామి వారి ఎదురుగా.. ఒక రాశిలా పోసి నివేదించారు. అనంతరం మఠం ఫిట్ పర్సన్ శంకర్‌బాలాజి, పూర్వపు మఠాధిపతుల కుమారులు ప్రసాదం పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. భక్తులు స్వీకరించి కళ్లకు అద్దుకుని ఆరగించారు. మరికొందరు ఇంటికి తీసుకెళ్లారు. భక్తులతో క్యూలైన్‌లు కిటకిటలాడాయి. మహాప్రసాదానికి ప్రొద్దుటూరు నియోజకవర్గం సంకటితిమ్మాయపల్లెకు చెందిన ఎరికలరెడ్డి, సుబ్బారెడ్డి ఉభయదారులుగా వ్యవహరించారు.

మహాప్రసాదం విశిష్టత

మహాప్రసాదం అనగా గొప్ప ప్రసాదం అని అర్థం. దేవతలకు నివేదించిన తర్వాత భక్తులకు పంపిణీ చేస్తారు. ఒక్కొక్క చోట ఒక్కో విధంగా ఇస్తారు. తమిళనాడులోని అన్ని శివాలయాల్లో విభూదిని ప్రసాదంగా అందజేస్తారు. అమ్మవారి ఆలయాల్లో కుంకుమ ఇవ్వడం జరుగుతుంది. అలాగే వీరబ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో 'విశేష గుడాన్నం' అందిస్తారు. దీనిని స్వీకరించిన వారికి సంతానం, వివాహం తదితర కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. ఉత్సవాలకు హాజరు కాలేని వారికి, తర్వాత వచ్చే వారికి ప్రసాదం అందించే పద్ధతి ఇక్కడ ఉంది. ప్రసాదాన్ని ఎండబెట్టి, తేమ లేకుండా నిల్వ చేసి సుమారు రెండు నెలల వరకు భక్తులకు అందజేస్తారు. కొందరు ప్రసాదాన్ని పార్శల్ ద్వారా తెప్పించుకుంటారు. నిద్రపోవు వారికి, నా వద్ద లేని వారికి ప్రసాదం అబ్బదు అనేది బ్రహ్మంగారి కాలజ్ఞాన వాక్యం. కావున భక్తులందరూ ప్రసాదం స్వీకరించడానికి అమితాసక్తి ప్రదర్శిస్తారు.

ఉత్సాహ భరితంగా ఉత్సవం

ఉదయం ఉత్సవ కార్యక్రమాన్ని ఉత్సాహ భరితంగా నిర్వహించారు. శ్రీ మాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, పీఠంపై అధిష్ఠింపజేసి, విశేష పూజలు చేశారు. పెద్దమఠం నుంచి చిన్నమఠం వరకు ఊరేగింపు చేపట్టారు. తిరిగి పెద్దమఠం చేరుకున్నారు. కడపకు చెందిన అమృతమ్మ, వెంకటసుబ్బయ్య శ్రేష్టి, లక్ష్మీదేవి ఉభయదారులుగా వ్యవహరించారు. తెల్లవారుజామున శ్రీవీరబ్రహ్మ సుప్రభాతం, నామ సంకీర్తనాన్ని ఆగమ వేద పండితులు ఇడమకంటి జనార్దన శివాచార్య, పోలేపల్లి రామబ్రహ్మం ఆధ్వర్యంలో నిర్వహించారు. గర్భాలయంలోని స్వామి, అమ్మవారి అర్చనామూర్తులకు గంగ, పంచామృతం, క్షీరం, ఫలోదకంలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక వస్త్రాలంకరణ చేశారు. స్వామి గుణగణాలను కీర్తిస్తూ, 108 నామాలలో స్తుతిస్తూ సహస్ర నామార్చన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వేదపారాయణం చేశారు. కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతులు శ్రీ వీరభోగ వసంతవెంకటేశ్వరస్వామి కుమారులు శ్రీ వెంకటాద్రిస్వామి, వీరభద్రయ్యస్వామి, గోవిందస్వామి, వీరం బొట్లయ్యస్వామి, దత్తాత్రేయస్వామి, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజి, మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఏర్పాట్లు చేశారు. ఎస్‌ఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

హుండీ ఆదాయం లెక్కింపు

శ్రీ జగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. స్వామి ఆరాధన గురుపూజ మహోత్సవాల్లో భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. గతేడాది తాత్కాలిక హుండీల ద్వారా 4.84 లక్షలు రాగా, ఈ ఏడాది 6.89 లక్షలు వచ్చినట్లు మఠం మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి తెలిపారు.


ఆలయ అధికారులు, సిబ్బంది, స్వామి శిష్యులు, భక్తులు లెక్కింపు చేపట్టారు.

రామసముద్రం పోలీస్‌స్టేషన్ తనిఖీ

రామసముద్రం : కర్ణాటక సరిహద్దు చెక్‌పోస్టులను అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. గుట్టపాళ్యెం, ఏ.కొత్తూరు, గజ్జ గంగనపల్లి, అల్పేపల్లె చెక్‌పోస్టులలో సిబ్బందిని ఏర్పాటు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టులలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అనంతరం రామసముద్రం పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సరిహద్దు చెక్‌పోస్టులు తనిఖీ నిర్వహించాలని సూచించినట్లు తెలిపారు. అలాగే స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. కర్ణాటక నుంచి వచ్చే నిషేధిత వస్తువులను, అక్రమ మద్యంను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీ కేశప్ప, సిబ్బంది ఉన్నారు.

యువకుడి అదృశ్యం


శ్రీకాంత్ (ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని నరసన్నగారిపల్లెకి చెందిన శ్రీకాంత్(17) అనే యువకుడు కనిపించకుండా పోవడంతో మంగళవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మండల పరిధిలోని నరసన్నగారి పల్లి గ్రామానికి చెందిన తుమ్మలకుంట పుల్లయ్య కుమారుడు శ్రీకాంత్ సోమవారం సాయంత్రం తన స్నేహితులు ఫోన్ చేయడంతో ఒంటిమిట్ట వరకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో మరుసటి రోజు యువకుడి కుటుంబ సభ్యులు పలువురిని ఆరాతీశారు. ఎటువంటి సమాచారం లేకపోవడంతో మంగళవారం యువకుడి కుంటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, యువకుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న ఐచర్

– యువకుడి దుర్మరణం


మృతి చెందిన బాలాజీనాయక్, రోదిస్తున్న బంధువులు

సంబేపల్లి : చిత్తూరు– కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి బైక్‌ను ఐచర్‌వాహనం ఢీకొన్న ప్రమాదంలో బి.బాలాజీనాయక్(25) అనే యువకుడు దుర్మరణం చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం దిగువకోటకొండ బిడికికి చెందిన బి.బాలాజీనాయక్ కొంత కాలంగా సంబేపల్లె మండల పరిధిలోని ఎర్రదిన్నెలబిడికిలో తమ అక్క దగ్గర ఉండేవాడు. ఈ క్రమంలోనే బాలాజీనాయక్ ద్విచక్రవాహనంలో కలకడ వెళుతుండగా గుట్టపల్లె పంచాయతీ కేవీ పల్లె వడ్డెపల్లె క్రాస్ వద్దకు రాగానే కలకడ వైపు నుంచి వస్తున్న ఐచర్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడికి వివాహం కాలేదు. సంబేపల్లె ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సికాడా కీటకం.. అప్రమత్తత అవసరం

వైవీయూ పర్యావరణ సహ ఆచార్యులు ఎం.శ్రీధర్‌రెడ్డి


వైవీయూలో కనిపించిన సికాడా కీటకం

వైవీయూ : సికాడా కీటకాలతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని యోగివేమన విశ్వవిద్యాలయం పర్యావరణశాఖ సహ ఆచార్యులు డాక్టర్ ఎం. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ప్రధానంగా ఏప్రిల్, మే నెలల్లో విద్యార్థులు ఎండల నుంచి రక్షణ కోసమో, పరీక్షలకు సన్నద్ధమ్యే క్రమంలో చెట్ల కింద చేరుతుంటారని, అదే సమయంలో ఈ కీటకం చర్యలు తారాస్థాయికి చేరుకుని వీటి నుంచి సహించలేని శబ్దం వెలువడుతుందన్నారు. ఇటీవల కాలంలో వైవీయూ పరిసరాల్లో సికాడీ కీటకాలు పెద్దసంఖ్యలో కనిపిస్తుండటంపై ఆయన వివరాలు వెల్లడించారు. సికాడా కీటకాల నుంచి 60–70 డెసిబెల్స్ శబ్దం వస్తుందని, కీటకాల చర్యల వల్ల 80 డెసిబుల్ శబ్దం వాతావరణంలో పెరుగుతుందని, మిట్ట మధ్యాహ్నం ఇంకాస్త పెరుగుతుందని, ఇది ప్రమాదకరమని పేర్కొన్నారు. హోమోప్టెరా జాతికి చెందిన సికాడా మగ కీటకాలు, ఆడ కీటకాలను ఆకర్షించడానికి ఈ శబ్ధాలు చేస్తుంటాయని తెలిపారు. సికాడా కీటకాల జీవిత చక్రం సుమారుగా ఏడాదిపాటు ఉంటుందని పేర్కొన్నారు. ఇవి ఎక్కువకాలం భూగర్భంలోని చెట్ల వేళ్ల రసాలను పీలుస్తూ జీవనం సాగిస్తాయన్నారు. వేసవి భూగర్భంలో వేడి పెరగడం వల్ల 6 సెంటీమీటర్లు పెరిగిన సికాడా కీటకాలు బయటకు వచ్చి రెక్కలను పెంచుకుని టేకు చెట్టు, కంపచెట్లు కాండం వద్దకు చేరుకుంటాయన్నారు. సికాడా మగ కీటకాల ఉదరం మీద ఇరువైపులా ఉండే టింబెల్ పొరలను అవి వేగంగా సెకనుకు 300 నుంచి 400 సార్లు కదిలిస్తూ శబ్దాలను చేస్తాయన్నారు. ఈ కీటకాలు చెట్లకు సంబంధించిన కణరసాలను పీల్చుకుంటూ బలాన్ని సమకూర్చుకుంటాయన్నారు. గత రెండు మూడేళ్లుగా వైవీయూలో విరివిగా పెరిగిన చెట్లపై సికాడా కీటకాలు ఆవాసం ఏర్పరుచుకున్నట్లు విశ్లేషించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంజిన్‌లో మంటలు


వాహనాన్ని పరిశీలిస్తున్న సీఐ వరప్రసాద్

రామాపురం : స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ఉన్న ఐచర్ వాహనంలో మంగళవారం తెల్లవారుజామున బ్యాటరీ రాసుకొని షార్ట్‌సర్క్యూట్ సంభవించడంతో ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. దీంతో టాప్ కాలిపోతుండగా సమాచారం తెలుసుకున్న పోలీసులు స్థానికుల సాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ సంఘటనలో ఇంజిన్ టాప్ కాలిపోయింది. ఈ వాహనం కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలో గత నెల 25న రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో ఇక్కడికి తీసుకొచ్చారు. సంఘటన స్థలానికి లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, ఎస్‌ఐ కొండారెడ్డి, ఏఎస్‌ఐ శర్మ చేరుకొని వాహనాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వల్లూరు : కడప – తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. కడప వైపు నుంచి కమలాపురం వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని వల్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో కడప వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనా ల్లో ప్రయాణిస్తున్న కిషోర్ కుమార్, నరసింహ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స కోసం క్షతగాత్రులను 108 వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

సరిహద్దు చెక్‌పోస్టుల్లో పటిష్ట నిఘా

- కర్ణాటక ఎన్నికల ప్రలోభాలపై ప్రత్యేక దృష్టి
- బార్డర్‌లలో 11 చెక్‌పోస్ట్‌ల ఏర్పాటు
- జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్‌రావు


చీకలబైలు వద్ద రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు

మదనపల్లె : కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌లలో పటిష్ట నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు తెలిపారు. మంగళవారం మదనపల్లె డీఎస్పీ కేశప్పతో కలిసి మదనపల్లె మండలంలోని చీకలబైలు, రామసముద్రం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్‌లను ఆయన తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం మదనపల్లె డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. కర్ణాటకలో ఈ నెల 10న అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సరిహద్దు మండలాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి ప్రత్యేక సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. తనిఖీలు మరింత ముమ్మరం చేశామన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ముఖ్యంగా మదనపల్లె, రామసముద్రం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాల్లోని రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో మొత్తం 11 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో 9 మద్యం దుకాణాలు ఉన్నాయన్నారు. పడమటి ప్రాంత మండలాల ప్రజలు చాలా వరకు కర్ణాటకలో నివాసం ఉండి జీవనం సాగిస్తున్నారన్నారు. మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన చేనేత కార్మికులు కర్ణాటకకు ఉపాధి కోసం వెళ్లి ఓటుహక్కు పొందారన్నారు. మదనపల్లె డివిజన్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన కూలీలు, కార్మికులు, ఉద్యోగులు సైతం కర్ణాటకలో నివాసం ఉంటున్నారన్నారు. ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక వాసులు మదనపల్లెకు వచ్చి ఓటర్లను కలిసి ప్రలోభాలకు గురిచేస్తున్నారన్నారు. ఇటీవల నలుగురు వ్యక్తులు నీరుగట్టువారిపల్లెలో కుక్కర్లు పంపిణీ చేస్తుండగా టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి ఎన్నికల సామగ్రిని స్వాధీనం చేసుకున్నారన్నారు.

ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎవరైనా ప్రలోభాలకు గురి చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. మద్యం దుకాణాల వద్ద పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని వాహన తనిఖీలు, పోలీస్, హైవే పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలన్నారు. సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎన్నికల ప్రలోభాలను, మద్యం రవాణాను అడ్డుకోవాలని డీఎస్పీ కేశప్పను ఆదేశించారు. అలాగే డివిజన్లో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రమాదకర మలుపులు, యాక్సిడెంట్ జోన్లు, బ్లాక్‌స్పాట్లను గుర్తించి వేగనిరోధకాలు, జీబ్రాక్రాసింగ్, హెచ్చరిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ప్రమాదాల నివారణకు జాతీయ రహదారుల్లో చేపట్టాల్సిన పనులపై ఇంజినీరింగ్ అధికారులకు నివేదిక అందజేశామన్నారు. మరమ్మతు పనులకై రూ.1.6 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. చేపట్టాల్సిన పనులపై ప్రతిపాదనకు సిద్ధం చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా భూవివాదాలు, ఆర్థిక నేరాలపై దృష్టి సారించామన్నారు. మదనపల్లెలో ఈ మధ్యకాలంలో భూవివాద గొడవలు ఎక్కువైనట్లు చెప్పారు. నకిలీ డాక్యుమెంట్స్ సృష్టించి జీపీఏ తారుమారు చేసి వేరే వాళ్ల భూములను తమపేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకుని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. మదనపల్లెకు చెందిన కట్టా సులోచనపై వరుసగా చీటింగ్ కేసులు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలిస్తున్నట్లు చెప్పారు. మదనపల్లెలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకై ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎస్పీ వివరించారు. కార్యక్రమంలో డీఎస్పీలు కేశప్ప, సుధాకర్, సీఐలు మురళీకృష్ణ, సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

దయలేని పుత్రుడు

తన రక్తం చిందించి పెంచి పెద్ద చేసిన తండ్రి బాగోగులు చూసుకోలేదు.. అనారోగ్యం బారిన పడినా పట్టించుకోలేదు.. ఆసుపత్రి పాలైనా కడసారైనా చూద్దామను కోలేదు.. చివరకు చనిపోతే అంత్యక్రియలు నిర్వహించకుండా మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయాడు. ఈ కుమారుడి తీరు చూసిన వారు.. 'తల్లిదండ్రుల మీద దయలేని పుత్రుడు..' అన్న ప్రజాకవి యోగి వేమన మాటల్ని గుర్తు చేసుకున్నారు.

- గువ్వలచెరువు ఘాట్‌లో తండ్రి మృతదేహం పడేసి వెళ్లిన వైనం
- పోలీసుల దర్యాప్తుతో వెలుగులోకి..


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఎం.డి.షరీఫ్

కడప అర్బన్ : చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలోని గువ్వల చెరువుఘాట్‌లో ఇటీవల ఓ వ్యక్తి.. తన తండ్రి మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయాడు. ఆ రహదారిలో వెళుతున్న వారు మృతదేహాన్ని గుర్తించి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కుమారుడిని అరెస్ట్ చేశారు. ఈ సంఘటనపై మంగళవారం కడపలోని డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ వివరాలు తెలియజేశారు. గత నెల 29న చింతకొమ్మదిన్నె మండలం కడప- రాయచోటి (ఎస్‌హెచ్-40) ఘాట్ రోడ్‌లోని నాలుగో మలుపు సమీపాన లోయవైపు గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్థానికులకు కనిపించింది. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సమయంలో గవర్నమెంట్ ఆఫ్ ఏ.పి సప్లై అనే అక్షరాలు కలిగిన ఆసుపత్రికి సంబంధించిన తెలుపు బెడ్‌షీట్, పసుపురంగులో వున్న కేన్‌లా పైపు, యూరిన్ ప్లాస్టిక్ బ్యాగ్‌ను చూశారు. సదరు వ్యక్తి కడప రిమ్స్ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని గుర్తించారు. చనిపోయిన తరువాత దహన సంస్కారాలు చేయకుండానే పడేసి పోయారని భావించారు. మృతదేహం వద్ద లభ్యమైన స్లిప్‌లలో ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు చేశారు. సదరు వ్యక్తి మృతదేహం జిల్లాలోని దువ్వూరు మండలం చిన్నసింగనపల్లె గ్రామం బొమ్ము చిన్నపుల్లారెడ్డిది అని తేలింది. ఆయనకు ఏకైక కుమారుడు బొమ్ము రాజశేఖర్‌రెడ్డి. తన తండ్రి చిన్నపుల్లారెడ్డి కొన్నేళ్లుగా టి.బి జబ్బుతోపాటు ఊపిరితిత్తుల సమస్య, ఆయాసం వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వున్నా, ఆయన బాగోగులు చూసుకోకుండా నిర్లక్ష్యం చేశాడు. దీంతో చిన్నపుల్లారెడ్డి ఇంటిలో ఎవరికీ చెప్పకుండా కడప రిమ్స్‌లో చికిత్స కోసం చేరాడు. ఆసుపత్రి వారు ఫిబ్రవరి చివరి వారంలో రాజశేఖర్‌రెడ్డికి ఫోన్ చేసి, మీ తండ్రి రిమ్స్‌లో తీవ్ర విషమ పరిస్థితిలో వున్నాడని సమాచారం ఇచ్చారు. దీంతో అతను తన తండ్రిని రిమ్స్ నుంచి డిశ్చార్జ్ చేయించుకుని ఇంటికి తీసుకుని వెళుతుండగా.. ఆసుపత్రి ఆవరణలోనే మృతి చెందాడు. తరువాత ఆటోను బాడుగకు మాట్లాడుకున్నాడు. తన తండ్రికి అంత్యక్రియలు చేసే స్తోమత లేక ఎవరికీ చెప్పకుండా గువ్వల చెరువు ఘాట్‌లో నాలుగవ మలుపు వద్ద మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయాడని విచారణలో తెలియజేశాడని సీఐ తెలిపారు. అతనిపై సీనియర్ సిటిజన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశామన్నారు. ఈ సమావేశంలో కడప రూరల్ సీఐ కె.అశోక్‌రెడ్డి, ఎస్‌ఐ బి.అరుణ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.